రాజాలుబాయికి జాతీయ మహిళా ఇన్‌స్పైర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజాలుబాయి

మోత్కూర్ : మోత్కూర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ అధికారిణి రాజాలు బాయికి పాన్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అందజేసే జాతీయస్థాయి మహిళా ఇన్‌స్పైర్ అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాదులోని బిర్లా టెంపుల్ భాస్కర ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, బాపు బొమ్మ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ నటి దివ్యవాణి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలి



మోత్కూరు : సన్మానం పొందిన మహిళలు

మోత్కూరు : సమాజంలో ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యేరెండ్ల కమలాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు విజయ, ప్రశాంతి, రష్మిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, పాఠశాల స్కావెంజర్లు, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాళ్లను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా అధ్యాపకులకు సన్మానం



రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

రామన్నపేట : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని రామన్నపేట ప్ర భుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం అన్నారు. శుక్రవారం కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను సన్మానించారు. గిన్నిస్‌బుక్‌లో స్థానం పొందిన డాక్టర్ జహీదాబేగం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళాసాధికారిత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుట్ట పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర బృందం



వైద్యాధికారి విలియంతో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

యాదగిరిగుట్ట : పట్టణ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర క్షయ వ్యాధి శిక్షణ, ప్రదర్శన కేంద్రం వైద్యాధికారి నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో చేపడుతున్న క్షయ నిర్ధారణ పరీక్షలు, సేవల్లో నాణ్యత, ల్యాబ్ టెక్నీషియన్ పనితీరును పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి విలియంతో మాట్లాడి క్షయ రోగులకు అందుతున్న వైద్యసేవలు, నిర్ధారణ పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ప్రభుత్వ విప్



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శుక్రవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. గంధమల్ల రిజర్వాయర్‌ను 1.41 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు కేబినెట్ ఆమోదం తె లిపినందుకు కృతజ్ఞతలు తె లిపారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

సభ్యత్వ నమోదు

రామన్నపేట : మండలంలోని సూరారం, బాచుప్పల, తుర్కపల్లి గ్రామాల్లో రజక వృత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవనగంటి స్వామి నిర్వహించిన సంఘం పొన్నం ఉప్పలయ్య, బాసాని శ్రీనివాసులు, కొండ్రాతి వెంకటయ్య, బాసాని మల్లయ్య, దామోదర్, చిన్నరాములు, మర్రిపెల్లి బాలయ్య, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మోత్కూరు : మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్టాండ్ కంట్రోలర్ కె.ఎల్లయ్య, రెడ్‌క్రాస్ మండల శాఖ అధ్యక్షుడు ఒ.సత్యనాథ్, కోశాధికారి బుస్స రవి, జిల్లా డైరెక్టర్ ఎస్.ఎన్.చారి, ప్రతినిధులు అనిల్ చేపూరి, అహ్మద్, యూత్ వింగ్ జిల్లా అధ్యక్షులు బి.మత్స్యగిరి, శివ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

బీబీనగర్: బైక్ అదుపుతప్పి గోడను ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రా మ పరిధిలోని మాధవరెడ్డి కాలనీకి చెందిన కుతాడి భానుచందర్(24) శుక్రవారం తెల్లవారుజామున బైక్‌పై బీబీనగర్ మీదుగా నాగిరెడ్డిపల్లి రహదారి మార్గంలో బ్రాహ్మణపల్లికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి గోడను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భానుచందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఒకరికి గాయాలు

వలిగొండ: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వలిగొండ మండలం నాగారం గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం జరిగింది. వలిగొండ మండలం లింగరాజుపల్లికి చెందిన గీత కార్మికుడు గోపగోని సాయిలు రోజు మాదిరిగా శుక్రవారం గోకారం, నెమిలకాల్వలో కల్లు గీసి బైక్‌పై తిరిగి వస్తుండగా.. నాగారం గ్రామ స్టేజీ వద్ద నల్లగొండ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిలు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 వాహనంలో రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మహిళలు సవాళ్లను అధిగమించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు



భువనగిరి : మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు



రామన్నపేట : జడ్జీలను సన్మానిస్తున్న న్యాయవాదులు



భువనగిరి : కృష్ణవేణి పాఠశాలలో..



భువనగిరి : విద్యుత్ మహిళా ఉద్యోగులు



బొమ్మలరామారం : ఎంపీడీఓ కార్యాలయంలో..

భువనగిరిటౌన్ : ఆధునిక సమాజంలో మహిళలు సాధికారత సాధించాలంటే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం భువనగిరి న్యాయవాదుల సంఘం, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత మాట్లాడుతూ మహిళలకు సమాజంలో తగిన గౌరవం లభించాలన్నారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ మహిళ పట్ల వివక్ష చూపించొద్దన్నారు. అనంతరం మహిళా న్యాయవాది వెన్నెల న్యాయ శాఖ మహిళా ఉద్యోగులు చైతన్య గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

భువనగిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో శుక్రవారం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘు అఖిలపాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు..

విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రీబాయిపూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటలు, పాటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ ట్రాన్స్‌కో ఏడీ సంధ్య, ఏఈ సుగుణ, విద్యుత్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

బొమ్మలరామారం : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నోడల్ అధికారి జ్యోతి కుమార్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్ రెడ్డి, ఏపీఎం శ్రీ లక్ష్మి, ఏపీఓ రమణ, జియాలజిస్ట్ స్వాతి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో..

రామన్నపేట : రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జీ కోర్టులో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్‌జడ్జి ఎం.ఉషశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జీ ఎస్.శిరీషను సన్మానించారు.

సీఐటీయూ జిల్లా కార్యాలయంలో..

భువనగిరిటౌన్ : పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా శ్రామిక మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. డాక్టర్ సురేష్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బోడ భాగ్య, మాయ కృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగు స్వప్న, సిలివేరు రామకుమారి, పంచాయతీ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రంగ సంతోష, కోశాధికారి పుష్ప, జ్యోతి, సైదమ్మ, మంగమ్మ, నాగమణి పాల్గొన్నారు.

సాగు నీరందించడమే లక్ష్యం



గచ్చుబావి చెరువు నుంచి నీటిని విడుదల చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : రైతులకు సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గచ్చుబావి వద్ద గల చెరువు నుంచి పెంచికల్‌పహాడ్, రామచంద్రపురం, కేసారం గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్వాపురం ప్రాజెక్టు కాల్వ ద్వారా మండలంలో కేసారం, బాలంపల్లి చందుపట్ల, వీరవెల్లి గ్రామాల చెరువులను నింపేందుకు కృషి చేస్తానన్నారు. బస్వాపురం రిజర్వాయర్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ. 50 కోట్లు విడుదల చేసినప్పటికీ పనుల కారణాల వల్ల పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అనంతరం బాలంపల్లి, పెంచికల్‌పహాడ్ చెరువులను పరిశీలించారు. ఆయన వె ంట పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లోని జల సౌధాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని శుక్రవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా బస్వాపురం ప్రాజెక్టుకు నీటి విడుదలపై, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



ఆలేరురూరల్ : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

ఆలేరురూరల్ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం ఆలేరు మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్,టౌన్ ప్లానర్ వీరస్వామి, మేనేజర్ బి.జగన్మోహన్, బాలకుమార్, పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్‌కు ఈ నెల 31 వరకు గడువు ఉందని యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇంటి స్థలం క్రమబద్ధీకరణ చేసుకునే వారందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూదాన్‌పోచంపల్లి : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ప్రభుత్వం ఈ నెల 31వరకు 25శాతం రాయితీ కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్-2020 ప్లాట్ల యజమానులు, వెంచర్ డెవలపర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీపీఎస్ రాధాకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరిటౌన్ : ఈ నెల 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకునే దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామలింగం తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌మేళా నిర్వహించారు. దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతులు



రామన్నపేట : ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

రామన్నపేట : పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీ యూ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రజువారం ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి రాము, గాదె ఎల్లయ్య, కన్వీనర్ కడారి భాగ్య, మంచాల రేణుక పాల్గొన్నారు.

అడ్డగూడూరు : పంచాయతీ గ్రామీణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ శంకరయ్యకు, ఎంపీఓ ప్రేమలతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బాలెంల మల్లయ్య బీరప్ప, మల్లేశ్, అంజయ్య, అవిలయ్య, సోమయ్య పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం): పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రాములు నాయక్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతి కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు నోముల స్వామి, అధ్యక్షుడు కూరెల్ల కిష్టయ్య, కార్యదర్శి జ్ఞానేశ్వర్, శ్రీను, కిష్టయ్య, పద్మారెడ్డి, స్వామి, మహిపాల్ పాల్గొన్నారు.

వలిగొండ : పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ , పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీపీఓ జితేందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా సహాయ కార్యదర్శి తుర్కపెల్లి సురేందర్, రాధారపు మల్లేశం, కొండే నర్సింహ, రాములు, ఎల్లమయ్య, గంగారావు సురేందర్, బోడ వెంకటేశం పాల్గొన్నారు.

బీబీనగర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గాడి శ్రీనివాస్, యాదమ్మ, బాలయ్య, రమేష్, పోచయ్య, మార్కేండయ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, శ్రీశైలం, శ్రీపతి బాలరాజు, లక్ష్మీకాంతం,సత్తయ్య, బాల య్య, యాదగిరి పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డికి నివాళి



భువనగిరి : మాధవ రెడ్డి స్మారక ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

భువనగిరి/భూదాన్‌పోచంపల్లి/చౌటుప్పల్/రామన్నపేట /బీబీనగర్: జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో శుక్రవారం దివంగత మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామ సమీపంలోని స్మారక ఘాట్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎలిమినేటి మాధవరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ము న్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, ఏవీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. రామన్నపేట మండలం వెల్లంకి లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సత్తిరెడ్డి మాజీ ఉపసర్పంచ్ పోచబోయిన నర్సింహ, గణేష్, గంజి రంగయ్య తదితరులు పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని కొత్తగూడెం ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమిరెల్లి నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. బీబీనగర్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో సత్యనారాయణ, అశోక్, నర్సింహ, కృష్ణ, వెంకటేష్, పెంటయ్య పాల్గొన్నారు. చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, మహేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అంజయ్య, నర్సింహ , గోశిక రవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామంలోని శ్రీ పద్మావతి సమేత, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా 108 కళశాలతో స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సుదర్శన హవనం, హోమం, తిరువీధి ఉత్సవం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు ఆలయ నిర్మాణకర్తలు, మాజీ జెడ్పీటీసీ దంపతులు కోట పుష్పలత మల్లారెడ్డి కలశ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట అంజిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాక నర్సింహ, గట్టు పాండురంగారెడ్డి, రంగ మధు, భోగ చంద్రోఖర్, రాజారమేశ్, కోట భూపాల్‌రెడ్డి, పట్నం పారిజాత, నూకల శ్రీశైలం పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలం



మాసాయిపేటలో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న గొంగిడి మహేందర్ రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట గ్రామంలో ఎండిపోయిన వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులోని నీళ్లను రైతులకు అందించకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. కాళేశ్వరం జలాలు విడుదల చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశ్యంతోనే రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వంటేరు సురేష్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, గుణగంటి బాబురావు, సొప్పరి మధు, బండ బాల సిద్దులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళలకు అండగా కాంగ్రెస్

ఆలేరురూరల్ : మహిళలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, దివ్య అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణం కాంగ్రెస్ భవనంలో జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కార్యదర్శి కళ్యాణి, జాలపు వనజారాణి, గ్యాదపాక దీపిక, పాము అనిత పాల్గొన్నారు.

ఇస్కిళ్లలో పశు వైద్యశిబిరం

రామన్నపేట : మండలంలోని ఇస్కిళ్ల గ్రామంలో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం సింగిల్‌విండో చైర్మెన్ నంద్యాల భిక్షంరెడ్డి, జిల్లా పశువైద్యాధికారి పి.జానయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ రాజశేఖర్, జిల్లా సహాయ సంచాలకుడు శ్రీనివాస్, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఇందిర, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నెబోయిన అయిలయ్య, మాజీ సర్పంచ్ గన్నెబోయిన విజయ భాస్కర్, మేడబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

భువనగిరి : పట్టణంలో వైఎస్సార్ గార్డెన్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో ఆర్‌వీఎం ఆస్పత్రి సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు నర్సింహ రావు, ఎంపల్ల బుచ్చిరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కోశాధికారి నిమ్మయ్య, శెట్టి బాలయ్య యాదవ్, శ్రీ నివాసరావు, రవీందర్, డాక్టర్లు సాయిపల్లవి, సునిత, ప్రవళిక, లక్ష్మణ్, జ్ఞానప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

భువనగిరి : హెచ్‌ఐవీపై అవగాహన అవసరమని ఎంజీయూ ఏఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి పసుపుల అన్నారు. శుక్రవారం పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రెడ్ రిబ్బన్ క్లబ్‌పీర్ లీడర్స్ సదస్సును నిర్వహించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ మహిపాల్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రి సోర్స్‌పర్సన్ నర్సింహా రావు, ప్రోగ్రాం ఆఫీసర్స్ వెంకటేష్, శిరీష, పావని, స్రవంతి, ముత్యాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత

రామన్నపేట : రామన్నపేట, సిరిపురం, వెల్లంకి, దుబ్బాక, ఎన్నారం, కొమ్మాయిగూడెం, కక్కిరేణి ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు యాపాల కృష్ణారెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు గుర్రం ఇంద్రసేనారెడ్డిలు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గవ్వ జ్యోతి, కార్యదర్శి బోయ గాలయ్య, భాస్కర్‌రావు, గుత్తా నర్సిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

వరిలో తడి పొడి విధానం పాటించాలి

యాదగిరిగుట్ట రూరల్: వరిలో తడి పొడి విధానం పాటించాలని ఏడీఏ శాంతినిర్మల, ఏఓ సుధారాణి అన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో వరి పంటలను శుక్రవారం పరిశీలించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఆత్మకూరు(ఎం): గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్య తీసుకోవాలని ఎంపీడీఓ రాములు నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎంపీఓ ఎలిమినేటి లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మోటకొండూర్: పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఎస్సై నాగుల ఉపేం దర్ తెలిపిన వివరాల ప్రకారం.. తు ర్కపల్లి మండలంలోని బిల్యానాయక్ తండాకు చెందిన గుగులోత్ బుజ్జి మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో వెళ్లి పట్టుకున్నట్లు తె లిపారు. అతడి వద్ద 3క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

రామన్నపేట : మండలంలోని పల్లివాడలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్ పరిశీలించారు. ఆయనవెంట ఎంపీఓ రవూఫ్‌అలీ, ఎంపీఓ పి.వెంకన్న, కార్యదర్శి శిరీష ఎఫ్‌ఏ కృష్ణ ఉన్నారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్



ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

మోటకొండూర్: పదవ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థుల బోధనా విధానం తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని సూచించారు. అంతకు ముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ రఘురాంరెడ్డి, భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, శ్రావణ్, విశ్వరూపం, డాక్టర్ మోసెస్ తదితరులు ఉన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

- 8 సిగరెట్ కార్టన్లను ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హ్యాండ్లూమ్ మార్కెట్ నుంచి చిన్నకొండూర్ రోడ్డుకు వెళ్లే మార్గంలో గల బాలాజీ కిరాణా దుకాణంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి బాలాజీ కిరాణా దుకాణం తాళాలు పగులగొట్టి షట్టర్‌ను పైకి లేపి లోనికి ప్రవేశించారు. సీసీ కెమెరాలను విరగొట్టి రోడ్డు వెంట వెళ్లేవారికి ఎలాంటి అనుమానం కలుగకుండా దుకాణం వద్ద ఓ తెరను అడ్డుగా కట్టారు. దుకాణం యజమాని సిగరెట్ల డీలర్ కావడంతో దొంగలు ఇతర సామగ్రిని పట్టుకోకుండా 8 సిగరెట్ కార్టన్లను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన యజమాని ఊర కృష్ణమూర్తి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రైలు కింద పడి ఇంటర్ విద్యార్థికి గాయాలు

ఆత్మకూరు(ఎం): ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థికి గాయాలయ్యాయి. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన ఒగ్గు కళాకారుడు కోరె సత్తయ్య కుమారుడు కోరె శివకుమార్ హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో గల అంబేద్కర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష రాసి శని, ఆదివారం సెలవులు కావడంతో కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో భువనగిరి వైపు వచ్చే రైలు ఎక్కాడు. వాటర్ బాటిల్ కిందపడిపోవడంతో దానిని అందుకుంటుండగా రైలు ముందుకు కదిలింది. దీంతో రైలు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన శివకుమార్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స నిమిత్తం రూ.5లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని దాతలు ఆదుకోవాలని శివకుమార్ తండ్రి సత్తయ్య కోరుతున్నాడు.

ఆరు స్కానింగ్ సెంటర్లకు నోటీసులు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ సెంటర్లలో శుక్రవారం ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించాయి. స్కానింగ్ పరికరాలు, రికార్డులను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తించారు. యుక్త స్కానింగ్ సెంటర్, గాయత్రి, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి, రాయల్, కేకే నర్సింగ్ హోం, అజయ్ హాస్పటల్‌లోని స్కానింగ్ సెంటర్‌కు నోటీసులు జారీ చేశారు. లోపాలను సరి చేసుకోవాలని, లేనిపక్షంలో యాక్టు-1994 ప్రకారం చర్యలు తీసుంటామని హెచ్చరించారు.